విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 19 నవంబరు 2025   8 పేజీలు

రాజమండ్రిలో

ఏలూరులో

తణుకులో

సామాజిక న్యాయంకోసం సీపీఐ నిరసన

> సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం, జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా దళిత, గిరిజన మైనార్టీ, మహిళలపై దాడులకు వ్యతిరేకంగా ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రజా ఆందోళనలు మంగళవారం విజయవంతంగా కొనసాగాయి. సీపీఐ నేతల నేతృత్వంలో ధర్నాలు,నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ఆందోళనలో పార్టీ, ప్రజా సంఘాల నేతలు పాల్గొని దళిత, గిరిజన, మైనార్టీలపై దాడుల్ని నియంత్రించాలని నినదించారు. జన గణనలో కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు.. రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్రంలోని మోదీ సర్కారు కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలలో సీపీఐ నాయకులు తాటిపాక మధు, మన్నవ కృష్ణచైతన్య, కోనాల భీమారావు, కామిరెడ్డి బోడకొండ, చలసాని వెంకట రామారావు, చెల్లబోయిన రంగారావు, ఎండి మునీర్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-రాజమండ్రి/ఏలూరు/తణుకు: దళిత బహుజన, గిరిజనులందరూ మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సామాజిక న్యాయం ఆత్మగౌరవం జన గణనలో కుల గణన చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి గత 11 ఏళ్ళ కాలంలో దళిత,గిరిజన, మైనార్టీ, వర్గాలపై దాడులు మితిమీరి పోయాయని అన్నారు.దేశంలో మతోన్మాద పాలన సాగుతోందని, అణిచివేత అంటరానితనం కుల మత వివక్షత హింస పేట్రేగిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని గత స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థలకు చెందిన పదవులు బీసీలు కోల్పోయారని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రభుత్వం కులగణన చేపట్టి ఎస్సీ, ఎస్టీ,బీసీ వర్గాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించిందని మధు తెలిపారు. మన రాష్ట్రంలో కూడా జనగణనలో కులగణన చేపట్టి కులాల ప్రతిపాదన బీసీలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాజమండ్రి సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు . ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, జట్ల సంఘం అధ్యక్షులు కే రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి పి.లావణ్య, జట్ల లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, ఏ ఐ వై ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. త్రిమూర్తులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ సునీల్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పి.కొండావతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరరావు, జట్ల సంఘం అధికార బాడి నల్ల రామారావు, దేవుడు బాబు, కాళ్ళ అప్పలనాయుడు, రెడ్డి వెంకట్రావు, పార్టీ నగర కార్యవర్గ సభ్యులు టి.నాగేశ్వరరావు, పార్టీ జిల్లా సమితి సభ్యులు కాకి శారద, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో

ఏలూరులో : దళితులు,మైనారిటీలు, గిరిజనులపై జరుగుతున్న దాడులు ఆపాలని, కుల వివక్షత, అణచివేతను నిర్మూలించడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సీపీఐ ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ▶మిగతా 4లో..

డ్రగ్స్‌పై ఉక్కుపాదం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకున్న చర్యలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తో కలిపి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ గంజా వినియోగం అనే మాట వినిపించకూడదని, ఏదైనా కేసులు గుర్తిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని హెచ్చరించారు. బాలలు, యువత జీవితాలపై గంజా ప్రభావం ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని, వారి బంగారు భవిష్యత్తును కాపాడవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మండలాల పరిధిలోని సబ్ ఇన్స్పెక్టర్లు జిల్లా పరిషత్ పాఠశాలల హెడ్మాస్టర్లతో తరచూ ▶మిగతా 2లో..

అభివృద్ధి పనులపై అలసత్వం వహిస్తే సహించేది లేదు

- జిల్లాలో రోడ్లు, ఆర్ఓబి నిర్మాణంపై ఎంపీ అసహనం
- సిపిఓ, ఆర్అండ్‌బి పనితీరుపై ఆగ్రహం
- దిశా సమావేశంలో సుదీర్ఘంగా సమీక్షించిన ఎంపీ మహేష్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జిల్లాలో జరిగే అభివృద్ధి పనుల విషయంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రోడ్లు గోతులమయంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో రోడ్ల మరమ్మతులు, నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసినప్పటికీ నేటికీ చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఇతరత్రా ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంపై ఆర్అండ్‌బి ఎస్ఈని నిలదీశారు. జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలు రచించి ముందుకు తీసుకువెళ్లడంలో వైఫల్యం చెందారని జిల్లా ప్రణాళిక విభాగం అధికారి పనితీరును తప్పుపట్టారు. మంగళవారం ▶మిగతా 2లో..

ఉత్పతికి అనుగుణంగా జీతాలివ్వడం అన్యాయం

ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు ధ్వజం

విశాలాంధ్ర - అమలాపురం : విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మికులకు ఉత్పత్తి- ఉత్పాదకతతో ముడిపెట్టి వేతనాలు చెల్లించడం అన్యాయం అని ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె. సత్తిబాబు ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 12 వేల కోట్లు ఉక్కు ఉత్పత్తి పెంచేందుకు కావాల్సిన మౌలిక వసతులకు కాకుండా స్టీల్ ప్లాంట్ అప్పులకు జమచేయడం తీవ్రమైన తప్పిదమని పేర్కొన్నారు. ఇప్పుడేమో ఎటువంటి మౌలిక వసతులు కల్పించకుండా, ఉత్పత్తి ఉన్నప్పుడే వేతనాలు చెల్లిస్తామని యాజమాన్యం జీఓ విడుదల చేయడం, దానిని రాష్ట్ర ప్రభుత్వం బలపరచడం ద్వారా కార్మిక శాంతిని భంగం చేసి లాకౌట్ ప్రకటించాలని చేసే ప్రయత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ జీఓను ఉపసంహరించి, ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకైన ఐరన్ ఓర్‌ను సమకూర్చి, అనుగుణమైన మౌలిక ▶మిగతా 4లో..

యాంటీబయాటిక్స్‌తో అనర్థాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : యాంటీబయాటిక్స్ మందులను ఎక్కువగా వాడడం వలన శరీరానికి అనర్థాలు కలిగే అవకాశాలు ఉన్నాయని బయ్యన గూడెం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వి. సత్య నారాయణ తెలిపారు. ప్రపంచ యాంటీ మైక్రో బియల్ రెసిస్టెన్స్ వారోత్స వాలు పురస్కరించుకొని మండలంలో బయ్యన్నగూడెం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా యాంటీబయాటిక్స్ వాడకం ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. అవసరమైతే తప్ప యాంటీబయాటిక్ మందులను ఎక్కువగా వాడకూడదని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైద్యుల సలహా లేకుండా రోగి నేరుగా మందుల షాపుకి వెళ్లి యాంటీబయోటిక్స్ మందులు కొని తెచ్చుకుని వాడటం వలన దీర్ఘకాలిక వ్యాధుల్లో కొంతమేర వ్యాధి తగ్గి మరల ఏ మందు వేసుకున్నా అనారోగ్యం తగ్గదని వైద్యుల సూచనలు పాటించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది , అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రైతులంతా పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని తిరుమలాపురం సొసైటీ అధ్యక్షులు రామచంద్ర వరప్రసాద్(పండు) తెలిపారు. మండలంలో రాజవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూటమి పార్టీల నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారి పోసా రావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రెండో విడత నగదును ఈ నెల 19వ తేదీన నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని, మండలంలో 8,304 మంది రైతులకు 5.54 కోట్ల రూపాయలు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలాపురం సొసైటీ అధ్యక్షులు బల్లె రామచంద్ర వరప్రసాద్, రాజవరం గ్రామపంచాయతీ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, టీడీపీ నాయకులు వాడపల్లి రాధాకృష్ణ, జనసేన నాయకులు కోన కుమార్ బాబు, సుదగాని సత్యనారాయణ, కాకర్లమూడి రాజేశ్వరరావు, కూటమి పార్టీల నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తడి చెత్త, పొడి చెత్త పై అవగాహన

విశాలాంధ్ర- ఉంగుటూరు: ప్రతి ఇంటికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి పారిశు ధ్య కార్మికులకు అందించే విధానాన్ని అలవాటు చేసుకోవాలని ఉంగుటూరు డిప్యూటీ ఎంపీడీవో రమేష్ బాబు ప్రజలకు వివరించారు. గ్రామం సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ఎంపికైన ఉంగు టూరు మండలం చేబ్రోలు గ్రామంలో మంగళవారం తడి చెత్త పొడి చెత్త పై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. సంపద కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారు...!

విశాలాంధ్ర-దెందులూరు: చంద్రబాబు ప్రభుత్వంఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఆడబిడ్డ నిధిని బ్యాంకు ఖాతా లకు జమ చేయాలని వైసీపీ దెందులూరు నియోజక వర్గం మహిళా విభాగ అధ్యక్షు రాలు అంగడాల సీతారామమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం మేదినరావు పాలెం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు నమ్మబలికి సూపర్ సిక్స్ పేరిట ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి హామీలు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 17 నెలలు కావస్తున్నా లక్షలాది మంది మహిళలు చంద్రబాబు ప్రభుత్వం బ్యాంకు ఖాతాలకు జమ చేసే ఆడబిడ్డ నిధి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వెంటనే ఆడబిడ్డ నిధి బ్యాంకు ఖాతాలకు చేయాలని డిమాండ్ చేశారు.

ఉక్కుపాదం (1వ పేజీ తరువాయి)

మమేకమై గంజా, తదితర మత్తు పదార్థాల వినియోగంపై సమాచారాన్ని రాబట్టాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు కళాశాలల్లో, పాఠశాలల్లో 826 ఈగల్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్, 1985 క్రింద 2025 జనవరి నుండి నేటి వరకు 12 కేసులు నమోదు కాగా 57 మందిని నిందితులుగా గుర్తించి, 55 మందిని అరెస్టు చేయడం జరిగిందని, 40.399 కేజీల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. దీని విలువ సుమారు రూ.3,72,680 ఉంటుందన్నారు. 2 వాహనాలను సీజ్ చేశామన్నారు. జిల్లాలో 64 కేసుల్లో సీజ్ చేసిన మొత్తం 641.544 కిలోల గంజాయిని జూలై 9న పల్నాడు జిల్లాలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో దహనం చేసినట్టు తెలిపారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు ఆర్.జి.సూర్య, డాక్టర్ శ్రీ వేద, విశ్వనాథ్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్.వి ప్రసాద్ రెడ్డి, డీఈవో ఇ.నారాయణ, జిల్లా రవాణా శాఖ అధికారి కే ఎస్.ఎన్.వి. కృష్ణారావు, రెవిన్యూ, పోలీస్, ఫారెస్ట్ అధికా రులు, ఈగల్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

సహించేదిలేదు (1వ పేజీ తరువాయి)

ఏలూరులోని కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సవివరంగా అధికారులను అడిగి తెలుసు కున్నారు.

ప్రధానంగా జిల్లాలో నిర్మిస్తున్న 12 ఆర్ఓబిల నిర్మాణం, జిల్లావ్యాప్తంగా మరమ్మతులకు గురైన రోడ్ల కోసం సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల నివేదికను అందించడంలో ప్రణాళిక విభాగం పనితీరు సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల ప్రణాళికపై ఎటువంటి సమాచారం అడిగినప్పటికీ నివేదికలు అందజేయకపోవడాన్ని ఎంపీ తప్పుపట్టారు. అదేవిధంగా వర్షాలు కారణంగా ఏలూరు పార్లమెంట్ జిల్లాకు మంజూరైన రూ.24 కోట్లతో చేపట్టిన పనుల గురించి ఆర్ అండ్ బి ఎస్ఈని ప్రశ్నించారు. జంగారెడ్డిగూడెంలో కేవలం 6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 11 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు పంపడమేమిటని ప్రశ్నించారు. దీనిపై ఆర్అండ్ బి ఎస్ఈ వివరణ ఇస్తూ జంగారెడ్డిగూడెం రోడ్లో నిర్మిస్తున్న ఆరు కిలోమీటర్లు చాలా కీలకమని వర్షాల కారణంగా తరచుగా ఈ రోడ్డు మరమ్మతులకు గురవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. అందువల్ల ఈ రోడ్డు మరింత పటిష్టవంతంగా నిర్మించేందుకు అంచనాలు రూపొందించి ప్రతిపాదించినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 44 కోట్ల రూపాయలతో పురోగతిలో ఉన్న రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన 2026వ సంవత్సరం జనవరి నెలాఖరు లోపు పూర్తి నాణ్యతతో పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈని ఆదేశించారు. రైల్వే శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న చిన్నపాటి సమస్యలను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని సమన్వయ పరచుకుంటూ ఆటంకాలను అధిగమించి జిల్లాను అభివృద్ధి వైపు ముందుకు తీసుకువెళ్లాలని రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. జిల్లాలో చేపట్టిన ఆర్ఓబీల నిర్మాణం విషయంలో అలసత్వం వహించవద్దని ఎంపీ రైల్వే అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ సెల్వి మాట్లాడుతూ దిశ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి వచ్చే సమావేశంలోపు అభివృద్ధి పనులపై పురోగతి సాధించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణయ్య, సొంగ రోషన్ కుమార్ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

SRI SIDDHARATHA DEGREE COLLEGE OF SCIENCE & COMPUTERS

(MANAGED BY SRI SIDDHARTHA EDUCATIONAL SOCIETY , VISSANNAPETA)

RECOGNIZED BY KRISHNA UNIVERSITY

ELURU DISTRICT, NUZVID - 521201

ADMISSION NOTIFICATION

SPOT/MANAGEMENT QUOTA ADMISSIONS FOR THE YEAR 2025-2026

APPLICATIONS ARE INVITED FROM ELIGIBLE CANDIDATES FOR "B" CATAGORY SEATS UNDER MANAGEMENT QUOTA FOR THE ACADAMIC YEAR 205-2026

COURSE CATEGORY	INTAKE	NO OF SEATS UNDER "B"
B.Sc(Chemistry)	30	09
B.sc (Botany)	50	15
B.Sc(Computer Science)	50	15
B.Sc (Artificial Intelligence)	40	12
B.Com (Computer Applications)	90	27
B.com (General)	40	12

Eligibility, admission and the fees will be as per the Government Order. The merit list and the Schedule of admission will be displayed on the college Notice Board .

For further information contact -7794820397

\- Management -

విద్యార్థులు మేధస్సును పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - పాలకోడేరు : ప్రతి విద్యార్థి చిన్నతనం నుండి తన మేధస్సును పెంచుకోవడం ద్వారా భవిష్యత్తుకు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకోవ డమే కాకుండా జీవితంలో స్థిరపడ డానికి పునాదులు వేసుకున్న వారు అవుతారని గొల్లల కోడేరు శాఖ గ్రంథాలయ అధికారి కె. బాలరాజు అన్నారు. 58వ జాతీయ శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పాలకోడేరు మండల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నెహ్రూ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భూపతి రాజు పృథ్వీరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నార్తులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - ఉండి: సమాజంలోని అన్నార్తులను ఆదుకోవాలని ఉండి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఉండిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమం మంగళ వారం జరిగింది. చెట్టు,పుట్ట, ఒంటరిగా బతుకు వెళ్ళదీస్తున్న అభాగ్యులకు అన్నం పెట్టడం ఎంతో పుణ్యమని కాగిత మహంకాళి అన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నాన్ని వృధా చేయొద్దని క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు కోరారు. దాత లయన్ కాగిత మహంకాళి మాట్లాడుతూ అన్నదానం మహాదానం అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్ సత్తి బ్రహ్మారెడ్డి, లయన్ బుద్ధరాజు సుబ్బరాజు, లయన్ ముదునూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. ఉండి మెయిన్ సెంటర్, ఆర్ అండ్ బి బంగ్లా, కొత్తపేట, బాలాజీరావు పేట తదితర ప్రాంతాలలో ఆహారపొట్లాలు పంపిణీ చేశారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని రామవరం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ కోరం శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ, విద్యార్థుల చదువు, అన్ని విధాలుగా పాఠశాల స్థితిగతులు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు చిర్రి దేవరాజు, సిఆర్‌పి కుంజా రాంబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కెమెరా సృష్టికర్త డాగురే జయంతి వేడుకలు

విశాలాంధ్ర - భీమడోలు: కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే నూతన విప్లవానికి నాంది పలికి కెమెరాను సృష్టించారని భీమడోలు సర్కిల్ ఫోటోగ్రాఫర్ సంఘ అధ్యక్షులు ప్రభు అన్నారు. మంగళవారం భీమడోలు సంతమార్కెట్ డాగూరే వేదిక వద్ద ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్విన్ మండే డాగురె జయంతిని పురస్కరించుకొని ఫోటోగ్రాఫర్స్ నాయ కులు ఆయన విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వీట్లు పంచారు. ఫోటోగ్రాఫర్స్ ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేసారు. కార్యక్రమంలో అధ్యక్షులు సిహెచ్ ప్రభుచౌదరి, కార్యదర్శి డి. శ్రీనివాస్, శివరామకృష్ణ, రంగారావు, పిల్లి బ్రహ్మారావు, నరేష్, చిన్ని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ప్లాస్టిక్ వినియోగం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : పురపాలక సంఘంలో 60 శాతం ప్లాస్టిక్ వినియోగం తగ్గించామని మున్సిపల్ కమిషనర్ ఎం. ఏసుబాబు తెలిపారు. మంగళ వారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ పై రాజకీయ నాయకులు , కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సహకారంతో ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలని మహిళలకు విజ్ఞప్తి చేయాల న్నారు. తడి, పొడి చెత్త నుంచి కంపోస్టు తయారీకి ఔత్సాహికులు ముందుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి మండలంలో 8075 మంది రైతులకు 5.27 కోట్లు

విశాలాంధ్ర- చాట్రాయి : అన్నదాత సుఖీభవ పథకంలో 8075 మంది రైతులకు రూ.5.27 కోట్లు రానున్నాయని చాట్రాయి మండల వ్యవసాయ అధికారి బి. శివశంకర్ తెలిపారు.
మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో చాట్రాయి మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో నిబంధనల ప్రకారం 8075 మంది రైతులకు 5.27 కోట్లు నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా వారి వ్యక్తిగత ఖాతాలకు వెళ్ళ నున్నాయని తెలిపారు. రైతులందరూ తమ ధాన్యాన్ని ఎండబెట్టుకుని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని గరిష్ట ధర పొందాలని కోరారు. రైతులు సంచుల కోసం స్థానిక రైతు సేవ కేంద్రాలలో సంప్రదించాలని తెలిపారు.

రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



విశాలాంధ్ర -చింతలపూడి రూరల్ : అధికారులందరూ సమిష్టి నిర్ణయంతో వ్యక్తిగత బాధ్యతతో పనిచేసి చింతలపూడి నియోజకవర్గంలో అత్యంత సమస్యాత్మకంగా ఉన్న రోడ్ల పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ కోరారు. మంగళవారం ఏలూరు కలెక్టర్ ఆధ్వర్యంలో గోదావరి సమావేశ మందిరంలో ఎంపీ అధ్యక్షతన ఏలూరు జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో చింతలపూడి శాసనసభ్యులు రోషన్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన సమస్య రోడ్లన్నీ అతి త్వరగా పూర్తి అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సంబం ధిత అధికారులను కోరారు.

కుష్టువ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: పిఎంపిల అసోసియేషన్ ఆఫ్ ఇండియా గణపవరం మండలం ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా పిఎంపి అధ్యక్షులు ఏఆర్కె పరమేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం గణపవరం మండలం కాశిపాడు గ్రామంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు అందమైన మెరిసే జిడ్డు గల చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కల లాగా ఉండడం, చెవులపై వీపుపై నొప్పులేని బుడిపెలు ,కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూత పడకపోవడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు మొదలగు లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి త్వరగా వెళ్లి అక్కడ వారు చేసే పరీక్షలు చేయించుకొని ప్రాథమిక దశలో మందులు తీసుకుంటే మొదటి ఆరు నెలల్లోనే తగ్గుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కాశిపాడు ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది ఏసమ్మ కృష్ణవేణి, పి ఎం పి సభ్యులు ఎం. శ్రీనివాసు ,ప్రజలు పాల్గొన్నారు.

మల్లాయిగూడెం ప్రజలకు మంచినీళ్లు ఇప్పించండి!

విశాలాంధ్ర -చింతలపూడి రూరల్ : ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు ఎవరు వచ్చినా మల్లాయిగూడెం గ్రామ ప్రజలకు తాగడానికి గుక్కెడు మంచినీళ్ళ ఏర్పాటు చేయించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్వం రోజుల నుండి మంచి నీళ్ళ కోనేరు వేసవి కాలంలో చలం నీళ్లు తాగే వారమని కోనేరులో చేపలు పెంచిన తర్వాత మంచినీళ్ళ వనరు లేకుండా పోయిందని దశాబ్దాల కాలంగా మంచినీళ్ళు కొనుగోలు చేసుకుని తాగడమే తప్ప పాలకులు ఎవరు శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం లేదని అంటున్నారు. ఎంఎల్ఏ ఎలిజా పాలన కాలంలో మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేసి షెడ్డు కట్టి యంత్ర పరికరాలు తీసుకువచ్చినా పంచాయతీ తీర్మానం ఇవ్వక పోవడం వల్ల కాంట్రాక్టర్ సామాన్లు వెనక్కి తీసుకు వెళ్లిపోయారని అంటున్నారు.

స్పందనలో ఫిర్యాదు చేసినా స్పందించడంలేదు

చింతలపూడి మండల రైతు సంఘం నాయకులు తక్కెళ్లపాటి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో సమస్య గురించి గత ప్రభుత్వ హయాంలో అనేక సందర్భాల్లో స్పందనలో ఫిర్యాదు చేసిన స్పందన లేకుండా పోయిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి 17 నెలలు అవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదన్నారు.

గ్రామంలో శాశ్వతమైన తాగునీటి సౌకర్యం కోసం . గ్రామానికి సరిహద్దులో ఉన్న గండిజర్ల సమీప ప్రాంతంలో బోరు వేసి పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేసి దానికి ట్యాంక్ నిర్మాణం చేసి దాని నుండి తాగునీరు ఇవ్వాలన్నారు. మండలంలోని శివపురం గ్రామానికి ఎండ పల్లి నుండి మంచినీటి సౌకర్యం వస్తుంద న్నారు. అదే విధానాన్ని మల్లాయగూడెంలో కూడా అమలు చేయాలన్నారు.

రూ. 2 కోట్లతో 15 సీసీ రోడ్ల అభివృద్ధి

పనులను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర - ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి రహదారులు,డ్రైనేజీల అభివృద్ధికి మోక్షం లభించింది. గ్రామంలో రహదారులన్నీ సీసీ రోడ్లు చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశించారు. ఆ మేరకు నారాయణపురం గ్రామంలో రహదారుల అభివృద్ధి శరవేగంతో జరుగుతున్నాయి. సుమారు రూ. 2 కోట్ల నిధులతో రహదారులు, డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ నిధులు రూ. 1కోటి 60 లక్షలు, ఉపాధి హామీ నిధులు 40 లక్షలు నిధులతో రోడ్లు వేస్తున్నారు. గ్రామంలో ఒకేసారి 15 రోడ్లు సిసి రోడ్లు వేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న పనులను మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, గ్రామ సర్పంచి దిద్ల అలకనంద శ్రీనివాస్, కాంట్రాక్టర్ దారుదు అక్కిన శేషు, పరిశీలించారు. కూటమి నాయకులు బొమ్మిడి అనిల్ కుమార్, రాంబాబు పాల్గొన్నారు.

ఆస్తి సమస్యలుంటే పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - గణపవరం: జిల్లాలో ఆస్తి యజమానులకు ఎవరికైనా కొలతలు యాజమాన్యం అభ్యంతరాలుంటే అప్పీలు స్వీకరించి తదుపరి చర్యలు తీసుకొని పరిష్కరిస్తామని పశ్చిమగోదావరి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎన్.రామనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం గణపవరం మండలం వెంకటరాజుపురం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 409 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, స్వమిత్వ ఫేజ్ 0 లో 43 గ్రామాలు సర్వే పూర్తికాగా ఫేజ్ 1 లో 15 గ్రామాలు పూర్తి అయినట్లు తెలిపారు. ఫేజ్-2లో 197 గ్రామాల ఎంపిక స్వమిత్వ ప్రయోజనాలు ఇళ్లు, ఖాళీ స్థలాలకు పీఏఎన్ నెంబర్లు యాజమాన్యాల హక్కుల కోసం బ్యాంకుల నుంచి రుణార్హతకు ఈ సర్వే ఉపయోగపడు తుందని తెలిపారు. గ్రామ కంఠంలో అనాదిగా నివాసాలు ఉంటున్నప్పటికీ కొందరికి హక్కు పత్రాలు లేవని, యాజమాన్య హక్కులు లేకపోవడంతో బ్యాంకుల నుంచి రుణార్హత పొందలేక పోతున్నారని ఇలాంటి సమస్యలకు స్వమిత్వ సర్వేలో పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం. సురేష్, డిప్యూటీ ఎంపీడీవో పల్లి వెంకట సత్యనారాయణ, సెక్రటరీ బిరుదుకోట రమేష్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

తుపాకుల దుర్గ , W/o. ఏసు, డోర్ నెం. 8-72, ఇందిరా కాలనీ, చేబ్రోలు (గ్రా), ఉంగుటూరు (మం), ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. నేను ది.28.10.2025 వ తేదిన నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.J9918329 ను బ్యాగులో పెట్టుకుని చేబ్రోలు మా ఇంటి నుంచి ఉంగుటూరు సెంటర్‌కు మోటార్ సైకిల్ పై వెళ్తుండగా పడి పోయినది.
ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరి కైనను దొరికిన యెడల అందజేయగలరు.

సమాజహితమే ధ్యేయంగా బోధించాలి

విశాలాంధ్ర-చింతలపూడి రూరల్: సమాజ హితమే ధ్యేయంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్య బోధించాలని చింతలపూడి ఎస్.ఐ. సతీష్ కుమార్ అన్నారు. ఇటీవల చింతలపూడి బాలుర వసతి గృహంలో తోటి విద్యార్థులు ఒక విద్యార్థి గొంతు కోసిన నేపధ్యంలో ఎస్ఐ విశాలాంధ్రతో మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠాలను బోధించ డంతోపాటు విద్యార్థుల మానసిక పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు. బాల్య దశనుంచే పగ ప్రతీకారం పెరిగితే భవిష్యత్తులో సమాజానికి తీవ్ర నష్టం జరుగు తుందన్నారు. వైషమ్యాలు పెరిగిపోతాయన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవడం వలన నేర ప్రవృత్తి లేని భావితరాలను తయారు చేయడానికి ఎంతో అవకాశం ఉందన్నారు.ఈ విషయమై ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కూడా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సామాజికవేత్త నూకరాజు మృతి

విశాలాంధ్ర - భీమడోలు : భీమడోలు గ్రామానికి చెందిన సామాజికవేత్త, రిటైర్డ్ టీచర్ గుల్ల నూకరాజు మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. భీమడోలు, పరిసర గ్రామాలలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహించి ఉద్యోగవిరమణ చేసి, ప్రజాసేవకు మానవతా సంస్థలో చురుకైన పాత్ర పోషించి వివిధ పదవులను అధిరోహించి, సేవాకార్యక్రమాలతో తనదైన ముద్రను వేసుకున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-టి నరసాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మెట్టగూడెం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వి. రవి కుమార్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాస రచన, కుర్చీల ఆటల పోటీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడల వలన క్రమశిక్షణ, పట్టుదల, ఐకమత్యం, సమయస్ఫూర్తి, కార్యదీక్ష వంటి గుణాలు పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, గ్రంథాలయ పాలకులు ఆర్. కిషోర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయంలో 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరు మరియు ఏడు తరగతులకు గ్రంథాలయాల ఉపయోగం, 8, 9, 10 తరగతులకు తుపానుల వల్ల కలిగే నష్టాల గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో జడ్.పి.హెచ్.స్కూల్, సంస్కృత ఉన్నత పాఠశాల, శ్రీనివాస స్కూల్, సెయింట్ జేవియర్ స్కూల్,గురుకుల పాఠశాల, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జేవియర్ స్కూల్ మాస్టర్ బి. ఏసురత్నం, నాగరాజు, సంస్కృత ఉన్నతపాఠశాల టీచర్ సుధాకర్ పాల్గొన్నారు.

సీపీఐ నిరసన (1వ పేజీ తరువాయి)

ఏరియా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 క్రైమ్ బ్యూరో రిపోర్ట్ చూస్తే దళితులపైన మైనారిటీల పైన ముస్లింల పైన దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. దళితులపైన 57 వేల పైచిలుకు దాడులు చేసిన నేరాలు నమోదు అయ్యాయని, ఎస్.టి.ల పైన 12,960 కేసులు నమోదయ్యాయని, మహిళలపై 4 లక్షల 48 వేల కేసులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2011 తర్వాత నుండి నేటి వరకు దేశ జనాభాను లెక్కించలేదని, ఇప్పుడు జరుగుతున్న దేశ జన గణన కార్యక్రమంలో కులగణన కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు కొంపల్లి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం జడ్జి గవాయిపై బూటు విసిరేంత వరకు దేశంలో కుల వివక్షత కుల ప్రేరేపిత దాడులు పెరిగిపోయాయని విచారం వ్యక్తం చేశారు. దేశంలో ప్రశ్నించేవారు దళితుడు, గిరిజనుడు, మైనారిటీ అయితే ఖచ్చితంగా వారిపై దాడి జరిగే తీరుతుంది అనే పరిస్థితులు బిజెపి దేశంలో నెలకొల్పిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శులు కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, కార్యవర్గ సభ్యులు మావూరి విజయ, కొల్లూరి సుధారాణి,గొర్లె స్వాతి,బళ్ల కనకదుర్గారావు, కొండేటి బేబీ, శాయన అభిలాష్ కుమార్,పాటి లు పెంటయ్య,బాలిన కృష్ణ ప్రసాద్,కొండేటి రాంబాబు,కాటూరి శ్రీధర్, తమ్మిశెట్టి రమణయ్య, ఉప్పులూరు లక్ష్మి, భవాని, ప్రభావతి,జ్యోతి,జోజి మేరీ,గౌరీ, ఏడుకొండలు, జుజ్జువరపు సురేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్, సాదిక్, సిద్ధు, అడ్డగర్ల సాకేత్, కనకదుర్గ, జ్యోతి, రాజ్యలక్ష్మి, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో : సామాజిక న్యాయం, సమానత్వ సాధన దిశగా జనగణనలో కులగణన చేపట్టి బడుగు, బలహీన వర్గాల జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్స్ అమలు చేయాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన దేశవ్యాపిత పిలుపుమేరకు జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిచి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ డి.అశోక్ వర్మకు అందజేశారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఏపీలో 143 బీసీ కులాలు వున్నాయని కులగణన ద్వారా జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్స్ అమలు చేయాలన్నారు.నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ,మహిళలపై దాడులు అధికమయ్యాయన్నారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడుతూ దేశంలో అణిచివేత, అంటరానితనం, కుల,మత వివక్షత పేట్రేగిపోతున్నదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలుకు నోచుకోవడం లేదన్నారు. సీపీఐ నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్టా అమ్మిరాజు, పెండ్యాల దత్తాత్రేయ ప్రసాద్, పెదపోలు వెంకట్రావు, నక్కా బాలయ్య, సబ్బితి బ్రహ్మయ్య, డివిఎన్ హనుమంతరావు, పులవర్తి సత్యనారాయణ, కొంబత్తుల రవికుమార్,బొద్దాని మురళి, నమ్మి రాజు, నూనె రాధాకృష్ణ తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు.

భీమవరం: అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, లౌకిక వ్యవస్థను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుంకట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్,



ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, ఎంసిపిఐయు జిల్లా నాయకులు కె.మహంకాళి పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మ గౌరవం కోసం దేశ వ్యాప్తంగా సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐయు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టే జనగణనలో కులగణన చేపట్టి వాటి ఆధారంగా బీసీ రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తదుపరి గత 11 ఏళ్ల కాలంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు మితిమీరిపోతున్నాయని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అణగారిన వర్గాల హక్కులు హరించబడుతున్నాయని, ప్రశ్నించే వారిపై మతోన్మాదులు దాడులకు, హత్యలకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎ.సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీపతి, తిరుమాని కామేశ్వరరావు, నాయకులు నాగిడి శాంతమూర్తి, ఖాన్ భాషా, మున్సిపల్ వర్కర్స్ నాయకులు నీలాపు శ్రీను, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు దండు శ్రీనివాసరాజు, చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు గూడూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు : దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు అరికట్టాలని సీపీఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో ఏఐటీయూసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ కేంద్రంలో మోది అధికారం చేపట్టి 12 ఏళ్ళ కాలంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వ సాధన ,ఆత్మగౌరవం కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లో రాజ్యాంగ, లౌకిక,ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తుందని విమర్శించారు. గిరిజనుల పొట్ట కొట్టేలా వారి హక్కులను హరించేలా అడవులను సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు పాలకులు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ మాదిరిగా ఏపీలో కూడా జనగణనలో,కులగణన చేపట్టి కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, కార్మిక సంఘం నాయకులు రాంబాబు, దుర్గాప్రసాద్, కృష్ణ, అప్పలనాయుడు, శ్రీను, సోమి నాయుడు, కృష్ణ, కన్నమ నాయుడు, శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు : పేదలపై నిరంతరం జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తి విఫలమయ్యాయని సీపీఐ నాయకులు విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్

నాయకులు ఎండి మునీర్, మండల కార్యదర్శి బాడిశ రాము మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలతో పాటు పేదలపై అనేక దాడులు జరుగుతున్నాయని అవి అరికట్టటానికి వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉత్తర భారతదేశంలో ఆ దాడులు అధికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు సరైన విధానాలు అవలంబించకపోవడం వలన దాడులు మరింత పెరిగిపోతున్నాయన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరటం వెంకటేశ్వర్లు, కురిమెళ్ళ వెంకటేశ్వరరావు, మడకం దుర్గారావు, తాటి దుర్గారావు, బుడిపిటి జాన్‌బాబు, మడివి కామయ్య, పిట్ట భీమయ్య, మచ్చ చంద్రరావు, కరటం పాపారావు, పిట్టా జయ, కాకా ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని దళిత వర్గాలకు సమానత్వాన్ని కల్పించాలని సీపీఐ జంగారెడ్డిగూడెం మండల సమితి డిమాండ్ చేసింది. జంగారెడ్డిగూడెం మండల

కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ స్లీవజోజి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు మాట్లాడుతూ దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల పై దాడులు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. వీటి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయడం లేదని విమర్శించారు. పటిష్టమైన ప్రణాళికలు లేకపోవడమే దీనికి కారణమని వారు అన్నారు. ఎస్సీ ఎస్టీలు దళితులు బీసీలు మైనార్టీలు లేకుండా ఏ ప్రభుత్వాలు ఏర్పడవని, ఆ వర్గాలను మర్చిపోతే మనుగడ ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, దాసరి నాగభూషణరావు, చందా త్రిమూర్తులు, చాకిరి సోమరాజు, మంగారావు, జగన్నాధ కృష్ణ, ఎర్రగొర్ల బజారు, చాగంటి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గల కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన నాటినుండి ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, వర్గాలపై హత్యలు అత్యాచారాలు దాడులు పెరిగిపోయాయని,దాడులు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కన్వీనర్ టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో కామవరపుకోట

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీవీఎస్ రాజు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా భారతదేశంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలపై జరుగుతున్న దాడులు అరికట్టడంలోనూ వారిపై చర్యలు తీసుకోవడంలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల పై ఇతర పేద ప్రజలపై జరుగుతున్న దాడుల అరికట్టాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ ఎలీషాకు సీపీఐ ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు ఎడ్లపల్లి రఫా, ఏలేటి రాములమ్మ, ఏఐటియుసి నాయకులు బాలిన రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు ఇతర పేదలకు రక్షణ కల్పించాలని, సామాజిక న్యాయం దక్కేల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. ద్వారకాతిరుమల మండల సీపీఐ కార్యదర్శి గొలిమే బాలయేసు ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ

ఆర్ఐ నాగరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాల యేసు మాట్లాడుతూ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం అట్టడుగు ప్రజలకు అందించాలని కోరుతూ గత దశాబ్ద కాలంగా భారతదేశంలో ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై, పేద ప్రజలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా జరుగుతున్నాయని వాటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, బికెఎంయు నాయకులు, కార్యకర్తలు యడ్లపల్లి రమేష్, యడ్లపల్లి సుబ్బారావు, ఏపూరి వెంకన్న, బసవ ప్రసాద్, చిన్ని కృష్ణ, శ్రీకాకుళం సత్యవతి, కొత్తపల్లి నాగరాజు, ఉండి నాగరాజు, గొల్లగూడెం శ్రీను, జాలాది సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : జనగణనలో కుల గణనను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో జన గణన ,కుల గణన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన వారిపై దాడులు అధికంగా జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని, దళిత వర్గాలకు సమానత్వం కల్పించాలని

తెలిపారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా కేంద్ర ప్రభుత్వం మార్చిన చర్యను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయక కార్యదర్శి లక్క లక్ష్మణరావు, సీనియర్ నాయకులు దుగ్గిరాల నారాయణరావు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వెలగల నాని, పులపాకుల దుర్గారావు, షేక్ బాజీ, సతీష్, వెలగల రామారావు, మట్టా రామకృష్ణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: కుక్కునూరు మండల సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీపీఐ కుక్కునూరు

మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడారు.మోదీ పాలనలో దళిత,గిరిజన, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లో రాజ్యాంగ లౌకిక ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తుందని విమర్శించారు. అనంతరం కుక్కునూరు ఎమ్మార్వో రమేష్ బాబుకు నాయకులు వినతి పత్రం అందజేశారు. నిరసనలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, కురాకుల బాబూరావు, సోడే శ్రీను, నారం దుర్గారావు పాల్గొన్నారు

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర – ముదినేపల్లి : ఆధునిక సమాజంలో సైబర్ నేరాలకు పాల్పడే వారు అధికమయ్యారని, వారి బారిన పడకుండా విద్యార్థులు జాగ్రత్త పడాలని ఉన్నత పాఠశాల పిఈటి పి. శ్రీనివాస్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై వ్యాసరచన , ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం , వ్యాసరచన ప్రాథమిక విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం. శ్రీదేవి, ఉపాధ్యాయులు కొత్తూరు సుబ్బయ్య, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అన్యాయం (1వ పేజీ తరువాయి)

వసతులు అందించి నాణ్యమైన ఉక్కు ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పరిశ్రమ అభివృద్ధికి ఉపాధి-కార్మిక వర్గాలు తమ బాధ్యతగా లక్ష్యాలను చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించాల్సిన సమయంలో భయపెట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యకరమని అన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి గతంలో పలు నాయకులు మద్దతు ఇచ్చినందునే అక్కడి ప్రజలు అత్యధిక మెజార్టీతో స్థానిక శాసనసభ్యుడిని ఎన్నుకున్నారని గుర్తు చేశారు.

ఇప్పుడు అదే ప్రజలు, ముఖ్యంగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన అధిక సంఖ్యాక ఉద్యోగులు, కార్మికులు తమ భవిష్యత్తు ఈ పరిశ్రమపైనే ఆధారపడిందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి చర్యలు తీసుకోవాలని సత్తిబాబు డిమాండ్ చేశారు.

వైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - నల్లజర్ల : నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఆవపాడు, ప్రకాశరావుపాలెం, నల్లజర్ల, తెలికచర్ల, సింగరాజుపాలెం గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా మూడో రోజు మంగళవారం నల్లజర్ల, ప్రకాశరావుపాలెం గ్రామాల్లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ, మానవహారం నిర్మించి గ్రామ కూడళ్లలో బాటసారులకు, షాపు షాపునా, ఇంటింటా, ఎలిమెంటరీ స్కూల్లో అవగాహన కలిగించారు. డ్రగ్స్ తో జీవితాలు నాశనమవుతాయని, కుటుంబాలు చిన్నా భిన్నం అవుతాయని, యువత నిర్వీర్యం అవుతుందని ప్రజలకు వివరించారు. అనంతరం నల్లజర్ల ఎస్ఐ, ఎం. మోహన్, వై.రాంబాబును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అరవింద్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి

విశాలాంధ్ర - నల్లజర్ల : నల్లజర్ల మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన అని శెట్టి రాంబాబు రోడ్డు ప్రమాదానికి గురై తలకు బలమైన గాయాల్తో మెదడులో తీవ్ర రక్తస్రావానికి గురైన వ్యక్తి ప్రాణాన్ని నిలబెట్టిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్ రాజు జగన్నాథపురం గ్రామానికి చెందిన ఆనిశెట్టి రాంబాబు ఒక నిరుపేద కుటుంబం ప్రమాదశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై తలకి బలంగా గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అత్యవసర వైద్యం నిమిత్తం రాజమండ్రి లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకువెళ్లారు. వైద్యులు చూసి వైద్య పరీక్షలు చేసి తలకు బాగా గాయం అయింది మెదడులో రక్తస్రావం అవుతుంది. (బ్రెయిన్‌లో ఇంటర్నల్ బ్లీడింగ్) ఇప్పుడే 50,000 కట్టాలని హాస్పిటల్ సిబ్బంది చెప్పారు రెక్కాడితేనే డొక్కాడని నిరుపేద కుటుంబం డబ్బులు లేని పరిస్థితి కానీ నేను ఉన్నాను ఏమీ అధైర్య పడవద్దు అని స్వయంగా ఎమ్మెల్యే మద్దిపాటి నేను చూసుకుంటా అని మాట ఇచ్చి సొంత డబ్బులు ఆ ప్రైవేట్ హాస్పిటల్లో అప్పటికప్పుడు 50,000కట్టి మెరుగైన వైద్యం అందించమని కోరారు. ప్రతీ రోజు స్వయంగా రాంబాబు వైద్యం గురించి అడిగి తెలుసుకుంటున్నారు. కుటుంబసభ్యులు. నిండు ప్రాణాన్ని కాపాడిన వైద్యులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు ధన్యవాదాలు తెలియజేశారు.

బర్మ్ నిర్మాణం పూర్తి

ఇంకెప్పుడో కథనానికి స్పందన

విశాలాంధ్ర - సీతానగరం: సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి నెలలు గడుస్తున్న నేటికి బర్మ్ నిర్మాణం చేయకపోవడం పై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అని విశాలాంధ్ర పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి నిర్మాణం చేపట్టారు. మండలంలో రఘుదేవపురం గ్రామ%శీ% నుంచి శుద్ధ మెట్ట మీదుగా కూనవరం వెళ్ళే 3.2 కిలోమీటర్ల రహదారిని నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఒక సారి పనులను మొదలు పెట్టగా రైతులు వేస్తున్న బర్మ్ సరిపోదు అది ఆగదు అని మూడు అడుగుల వెడల్పు, రోడ్డు మీద 5 అంగుళాల ఎత్తు ఉండేలా బర్మ్ నిర్మాణం చేయాలని గుత్తేదారుడుతో వాగ్వివాదం చేసి పనులను నిలిపి వేసిన సంగతి తెలిసిందే. దీనిపై విశాలాంధ్ర పత్రికలో వరుస కథనాలు రావడంతో ఎట్టకేలకు బర్మ్ నిర్మాణం పనులను ప్రారంభించారు. దీనిపై పంచాయితీ రాజ్ శాఖ అదనపు ఏ ఈ జోయెల్ ని వివరణ కోరగా రైతుల కోరిక మేరకు సీసీ రోడ్డు ఇరువైపులా ఒక మీటర్ వెడల్పు, రోడ్డు పై మూడు అంగుళాల ఎత్తుతో గుత్తేదారుడు బర్మ్ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు.

పచ్చదనం, పరిశుభ్రత నిర్వహణపై శిక్షణ



విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సీతానగరం మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎమ్ భారతి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలకు గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత నిర్వహణ పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ సుబ్రమణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, కంప్యూటర్ అసిస్టెంట్లు జగదీష్, సతీష్, జూనియర్ అసిస్టెంట్ సుమతి, ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - దేవరపల్లి : గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెం శాఖా గ్రంథాలయం నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు . యర్నగూడెం గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. విద్యార్థులు యువత గ్రంథాలయం ద్వారా జ్ఞాన సముపార్జన చేసుకోవాలని సూచించారు. విజ్ఞానం అందించే మరిన్ని పుస్తకాలు కొనుగోలు చేయమని పదివేల రూపాయలను విరాళంగా మద్దిపాటి అందించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆండ్రు అనిల్ సీనియర్ నాయకులు, గ్రామ తెదేపా అధ్యక్షులు బొల్లిన విజయభాస్కర్, తెదేపా నాయ కులు గద్దె శ్రీనివాస్, మండ సుబ్బారావు, బొల్లిన వెంకటేశ్వరరావు మర్రి వెంకటేసు, టెక్కెం చిట్టిబాబు భాజపా నాయకులు మండ జనార్ధనరావు, జనసేన నాయకులు బళ్ల రామ చంద్రరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు ప్రతాప్ కుమార్ లైబ్రేరియన్ జి అనిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు వక్తృత్వ పోటీలు గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు స్వచ్ఛందర స్వచ్ఛభారత్ పై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఎర్నగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నన్నయ నూతన భవనాలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - రాజానగరం : మండలం లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన పలు భవనాలను కలెక్టర్ కీర్తి చేకూరి, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తో కలిసి మంగళవారం పరిశీలించారు. యూనివర్సిటీకి విచ్చేసిన కలెక్టర్ కీర్తి చేకూరి ను వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజి నీరింగ్ భవనం, ఎగ్జామినేషన్స్ భవనం, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ భవనాలు నిర్మాణం పూర్తై ప్రారంభోత్స వానికి సిద్ధంగా ఉండడంతో వాటిని పరిశీలించారు. అలాగే భవన నిర్మాణాలు పట్ల వర్సిటీ ఉపకులపతిను అభినందించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తో మాట్లా డుతూ వర్సిటీ నిధులతో నిర్మించిన వాటికి సంబం ధించి రూ:20.05 కోట్లు కాగా వాటిలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ భవనం, రూ:8.25 కోట్లు, ఎగ్జామినేషన్స్ భవనం, రూ:5.50 కోట్లు, స్కూల్ ఆఫ్ కామర్స్ ,మేనేజ్మెంట్ స్టడీస్‌కి రూ:11.10 కోట్లు, బాయ్స్ హాస్టల్ భవనాలు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడు మృతి

విశాలాంధ్ర - గోపాలపురం : కారు ఢీకొట్టిన సంఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరొక యువకుడు తీవ్రగాయాలు పాలైన సంఘటన దేవరపల్లి మండలం రామన్నపాలెం జాతీయ రహదారిలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం వాదాలకుంట గ్రామానికి చెందిన కొడమంచిలి సుభాష్ (18) తాపీ పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి తన తాతకు మందులు తీసుకువచ్చేందుకు ఇంటి నుండి తన స్నేహితుడు వెదురుకుంట గ్రామానికి చెందిన పులిదిండి మణికుమార్ తో కలిసి తన బైక్ పై వెళ్లారు. రామన్నపాలెం హైవే వద్ద వెనక నుండి వచ్చిన కారు వేగంగా బైకును ఢీకొట్టడంతో సుభాష్ తలకు దేహానికి బలమైన గాయాలయ్యాయని కొద్దిసేపటికే 108 వాహనం సహాయంతో హైవే అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సుభాష్ మృతిచెందగా తీవ్ర గాయాల పాలైన మణికుమార్ను మెరుగైన వైద్యం కోసం రాజమండ్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

విశాలాంధ్ర - తాళ్లపూడి : కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంక టేశ్వరరావు సీఎంరిలీఫ్ ఫండ్ క్రింద మంజూరైన చెక్‌లను అందించారు. ఎన్టీఆర్ వైద్య సేవలు కింద వైద్యం చేయిస్తున్నామని, ఈ పథకం పరిధి లోకి రాక ఆస్పత్రుల్లో చేయించుకున్న వైద్య సేవలకు గాను, బల్లిపాడు, టి.మెట్ట, మలకపల్లి గ్రామాల లో భాదితులకు మంజూరైన 2 లక్షల యాభై వేల రూపాయల విలువైన చెక్‌లు ఇచ్చామన్నారు. దీని లో భాగంగా తిరుగుడు మెట్ట గ్రామానికి చెందిన మోయ్యేటి అరుణ కుమారి అనుమెకి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాబడిన రూ. 48,291 ల చెక్కును అందచేశారు. ముప్పిడి తో పాటు టి.మెట్ట నాయకులు అన్న మరెడ్డి రమణ, అన్నమ రెడ్డి సత్తిబాబు, సిద్ద దుర్గారావు, నామన పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బల్లిపాడులో డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఎస్సి ఏరియాల్లో డ్రైన్ నిర్మాణాలకు పి.ఎం.ఏ.జి.వై పథకం అమలు ద్వారా అవకాశం కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తాళ్లపూడి మండలం బల్లిపాడు గ్రామానికి మంజూరైన 20 లక్షల రూపాయల విలువైన డ్రైన పనులకు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో డ్రైన్ సమస్యకు పరిష్కారం లభించింది అని అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఎన్డీయే కూటమి నాయకులు సిద్ద దుర్గ ప్రసాద్, నామన పరమేశ్వరరావు, కాకర్ల శ్రీను, మద్దుకూరి శంకరం, జగదీష్, రమేష్, పలు గ్రామాల నాయకులు, మండల అధికారులు ఎంపీడీఓ వేణు గోపాల రెడ్డి, ఆర్.డబ్ల్యు.ఎస్ ఏ.ఈ సూర్జహాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్నికాయిట్‌కు ఎంపికలు

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో టెన్నికాయిట్అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ స్థాయి బాలబాలికల సెలక్షన్స్ జరిగాయి. దానిలో భాగంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైనారు వీళ్ళు ఈనెల 21 22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సోంపుడి లో జరిగే స్టేట్మెంట్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నసూపదైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, టెన్నిగేట్ అసోసియేషన్ అధ్యక్షులు గద్దె చంద్రశేఖర్ జిల్లా సెక్రెటరీ ఏవీఆర్ సరస్వతి, రామారావు, ఎంపికైన విద్యార్థులు బాలికల విభాగంలో ప్రియదర్శిని, ఎస్కే లతీపా, ఆర్ సారికా, ఎం లోహిత, పి హస్య బాలుర విభాగంలో జి.బాబి, వై ఈశ్వర్ ఆకాష్, జి చినబాబు, కే ఆకాష్ ఎంపికయ్యారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-దేవరపల్లి: 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో మంగళ వారం స్థానిక దేవరపల్లి శాఖ గ్రంథాలయంలో స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీ అంశం గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు, సెల్ఫోన్ సోషల్ మీడియా వల్ల అనర్ధాలుఫ అను అంశం మీద వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమం నాకు స్థానిక హర్షవర్ధన్ శ్రీ చైతన్య భాష్యం డిగ్రీ కాలేజ్ జడ్పీహెచ్ స్కూల్ తదితరు స్కూల్స్ నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ స్థానిక అడ్వకేట్ కేశిరాజు వెంకటరాజు కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.స్థానిక స్కూల్ టీచర్స్ గద్దం చిరంజీవి, వి హరిబాబు, మణి మూర్తి జయంత్ కార్యక్రమం పర్యవేక్షించారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - కొవ్వూరు: దేచెర్ల గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ యోజన కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా రూ.20 లక్షలతో నిర్మించే సీసీ డ్రైనేజీకి మంగళవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరి ష్కార దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుం దని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగర్జున, ఎంపీపీ కాకర్ల నారాయుడు, వైస్ ఎంపీపీ వీరమల్ల నారాయుడు, కొవ్వూరు మండల అధ్యక్షులు నారాయణ, పీకే రంగా రావు, పొట్రు సిద్ధు, కోమటి కృష్ణంరాజు ఏఎంసీ డైరెక్టర్లు కొప్పాక విజయ్, కుమార్, బాలకృష్ణ, శివ, పోతురాజు, సాంబ శివరావు,అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌పై ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నా క్యాంటీన్‌లలో పేదలకు అందించే భోజనం నాణ్యత ఎల్లప్పుడూ ఉత్తమంగా ఉండేలా చూడాలని కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి షాన్మోహన్ సగిలి సూచనల మేరకు ఇన్‌చార్జ్ కమిషనర్ కెటి సుధాకర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం కాకినాడ సంత చెరువు వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను సందర్శించిన ఆయన, అక్కడి సిబ్బందికి మెనూను కచ్చితంగా పాటించడం, భోజనం శుచిగా, రుచిగా అందించడం, సమయపాలన తప్పనిసరిగా పాటించడం వంటి సూచనలు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్నా క్యాంటీన్‌లలో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయవద్దు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయవద్దని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పిఠాపురం నియోజవర్గం ఇంచార్జ్ వంగా గీత ఆదేశాల మేరకు మంగళవారం వాకతిప్ప గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ రద్దు చేసే వరకు గ్రామస్థాయి నుండి పోరాటం సాగిస్తామని అన్నారు. వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ మహిళలను చైతన్య పరిచి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జ్యోతుల వాణి, అలపు సుధారాణి, లక్ష్మీకాంతం, బత్తిన రాణి, మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు రావు చిన్నారావు, జ్యోతుల బాబులు, గోపు హరిబాబు పాల్గొన్నారు.

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా కేంద్ర గ్రంథాలయం కాకినాడలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములు సందర్భంగా 18వ తేదీన 5వ రోజు పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు నిర్వహణకు న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు దీ సూర్యనారాయణ, అసిస్టెంట్ విజిటింగ్ ప్రొఫెసర్ జీచీఖ ఖ మెహర్ గంగాధర్ పాల్గొన్నారు. ఈ వకృత్వ పోటీలు జూనియర్ విభాగం 6,7 తరగతులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు అనే అంశం పై సీనియర్స్ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సోషల్ మీడియా ప్రయోజనాలు-అపాయాలు అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఇన్‌చార్జ్ ఖ కిషోర్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వీ శ్రావ్య, గ్రంథాలయ సిబ్బంది, నాగేంద్ర కుమార్, చీమీ ఫణీంద్ర కుమార్, వీర్రాజు, దుర్గా ప్రసాద్, అరుణ కార్యాలయ సిబ్బంది , రాజు, సాయి వెంకట్రావు , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్పింగ్ యూత్ సభ్యుల ఆర్థిక చేయూత

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక దిబ్బలపాలెంకు చెందిన పంతం సత్యనారాయణ అనే వృద్ధునికి హెల్పింగ్ యూత్ సభ్యులు మంగళవారం ఆర్థికచేయుతను అందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ యూత్ సభ్యులు మద్దుల స్వరూప్, ఎస్కే అలీషా మీడియాతో మాట్లాడుతూ పంతం సత్యనారాయణ, ఆయన తల్లి చాలా కాలం నుంచి అనారోగ్యానికి గురై చాలా దీన స్థితిలో ఉండడం తెలుసుకుని, హెల్పింగ్ యూత్ ద్వారా బియ్యం, కూరగాయలు, పండ్లు, 1000 రూపాయల నగదు అందజేశామన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం పింఛను గాని, రేషన్ గాని రావడం లేదని, దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి సత్యనారాయణకు ఆర్థిక సహాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ యూత్ సభ్యులు రామ్ లాల్, ఎస్కేఅలీ, స్వరూప్, పర్వత శివ, ఎస్కే అలీషా పాల్గొన్నారు.

వ్యాపారవేత్తలుగా ఎదగటానికి ప్రభుత్వ పథకాలు దోహదం

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని వ్యాపారవేత్తలుగా ఎదగటానికి ఉన్న అవకాశాల గురించి బిడిఎస్ వార్క్ షాప్ సామర్లకోట టీటీడీసీ కార్యాలయం నందు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీహెచ గణపతి తెలిపారు. ప్రతి ఇంటి నుండి ఒక వ్యాపార వేత్తను తయారు చేయాలనే ముఖ్యమంత్రి అభిలాష, మహిళా సాధికారత, నైపుణ్యవంతమైన బీడీఎస్ ప్రొవైడర్లు ఎంఎస్ఈ రంగాన్ని బలోపేతం చేయడంలో ఎంతో ఉపయోగం. ఈ కార్యక్రమంలో వివిధ వ్యాపార, సాంకేతిక, ఆర్థిక, బ్యాంకు రుణాలు, సబ్సిడీ, అనేక రకాల వ్యాపార సలహా సేవలు అందించటము గురుంచి శిక్షణ ఇచ్చారని ఆయన తెలిపారు. ఎల్ఈఏపి (అమలు భాగస్వామి), ఏపీ ఎంఎస్ఎంఈ (నోడల్ ఏజెన్సీ)గా వరల్డ్ బ్యాంక్ నిధులతో నడుస్తున్న ఆర్ఎఎంపిఎస్ ప్రాజెక్ట్ కింద, కాకినాడ జిల్లా సామర్లకోటలోని టీటీడీసీ కార్యాలయంలో బిజినెస్ డెవలప్మెంట్ సర్వీస్ ప్రొవైడర్స్ కార్యక్రమం సంయుక్తంగా నిర్వహించాయని జీఎం సీహెచ గణపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాకినాడ జిల్లా డీఆర్డిఏ పీడి శ్రీనివాస్, ఐఎల్ఓ మాస్టర్ ట్రైనర్ చరణ్ సంజీవ్, రిటైర్డ్ చీఫ్ మేనేజర్ ఎస్బీఐ బాలాజీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగ పరుచుకోవాలని ఏలే శ్వరం మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి) అన్నారు. ఈ మేరకు మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) ప్రారంభిం చారు. 2025, ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేం ద్రాల ద్వారా రైతుల వద్ద నేరుగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ సందర్భం గా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని 17శాతంలోపు తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని తెలిపారు. ప్రభుత్వం గోనె సంచులను రైతులకు అందజేస్తుందని, జిపిఎస్ వాహనాలకు సంబంధించిన వివరాలు వ్యవసాయ శాఖ అధికారులు అందు బాటులో ఉంచామని అన్నారు. ప్రభుత్వం కామన్ రకం 75 కేజీలకు ధర రూ.1777, ఏ గ్రేడ్ ధర 1792 రూపాయలను ప్రభుత్వం రైతులకు అందిస్తుందన్నారు. రైతులు పండించిన పం టకు గిట్టుబాటు ధరతో పాటు సకాలంలో రైతులు ఖాతాలోకి నగదు జమ చేస్తారని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దేశభక్తి గేయాలు, పాటల పోటీలు

విశాలాంధ్ర - పిఠాపురం : 58వ జాతీయ గ్రంథాల వారోత్సవాలు ఐదవ రోజు పిఠాపురం శాఖా గ్రంథాలయంలో దేశభక్తి గేయాలు పాటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీ లకు న్యాయ నిర్ణేతలుగా ఆర్ఆర్‌బిహెచ్ ఆర్ ప్రభుత్వ జూని యర్ కళాశాల సంస్కృత అధ్యాపకులు పి రామచంద్రరావు , ప్రముఖ సంగీత ఉపాధ్యాయులు డాక్టర్ ఎస్ చక్రవర్తి వ్యవహరించారు. అనంతరం రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశం పట్ల, భరత మాత పట్ల భక్తి, విశ్వాసాలు కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ దేశం మనకి ఏమి ఇచ్చిందని కాకుండా దేశానికి మనం ఏమి ఇస్తున్నామనే ఆలోచనలో ఉం డాలని, అతి పెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత దేశంలో పుట్టినందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్ వెంకటరాము, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండియా రికార్డ్స్ వెంకట్‌కు సన్మానం

విశాలాంధ్ర - కాత్రేని కోన : ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎక్కిన కాత్రేనికోన పిల్లోడు విత్తనాల కుషాల్ నాగ వెంకట్‌కు మంగళవారం కాత్రే నికోన ఎంపీడీవో వెంకటా చలం దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఇటీవల 195 దేశాల రాజధానుల పేర్లను స్వల్ప వ్యవధిలో చెప్పి వెంకట్ ఇండియా బుక్కులో రికార్డు సాధించాడు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు కోలాటి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ జీవోను రద్దు చేయాలి

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ జీవోను రద్దు చేయాలని వైసీపీ పెద్దాపురం నియోజక వర్గం ఇంచార్జ్ దవులూరి దొరబాబు పేర్కొన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్‌కు తమ పార్టీ అండగా వుంటుందని చెప్పారు. మంగళవారం సామర్లకోట మెహర్ కాంప్లెక్స్ సెంటర్లో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పార్టీ పట్టణ అధ్యక్షులు పాగా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ఇంచార్జ్ దొరబాబు పాల్గొని మాట్లాడుతూ వైద్యం,వైద్య విద్యను పేదలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలను నిర్మాణం చేపట్టి ఐదింటిని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు యత్నిస్తున్నారన్నారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు దొరబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, మన్యం చంద్రరావు, ఇరుసుమళ్ళ సాయి, కరణం భాను, జట్ల మోహన్, కరణం రాజ్ కుమార్, పాలికి కుసుమ చంటిబాబు, చిట్టిమాని శ్రీను, రెడ్నం దొరబాబు, రెడ్డి లోవకుమారి, లింగం శివ ప్రసాద్, వారా సుధాకర్, మర్రి శేషారావు తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య, పరిశోధనలో గవర్నమెంట్ కాలేజ్ అభివృద్ధి ప్రశంసనీయం

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రాష్ట్ర మానవ వనరుల, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం గవర్నమెంట్ కాలేజ్ (ఆటోనమస్), రాజమహేంద్రవరంను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కళాశాల అకడమిక్ ప్రగతి, పరిశోధనా వాతావరణం, విద్యార్థుల వినూత్న ఆలోచనలకు అనుకూలంగా ఏర్పాటుచేస్తున్న సౌకర్యాలను సమీక్షించి, కళాశాల చేస్తున్న కృషిని ప్రశంసించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ప్రారంభ ద్వారం, ఇంక్యూబేషన్, ఇన్నోవేషన్ మరియు ఎంటర్ ప్రెన్యూర్షిప్ బ్లాక్‌ను సందర్శించి విద్యార్థులు అభివృద్ధి చేసిన ప్రాజెక్టులు, స్టార్టప్ ఆలోచనలు, ఇన్నోవేటివ్ నమూనాలను పరిశీలించారు. అనంతరం అరకు కాఫీ హబ్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రాసెసింగ్ మరియు

బ్రూయింగ్ విధానాలను ఆరా తీసి ప్రశంసించారు. స్కానర్ ద్వారా చెల్లింపు చేశారు. మీ తరువాత డా. సి.వి. రమన్ అంతర్జాతీయ పరిశోధన కేంద్రం, నానో టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబ్‌లను పరిశీలించి జరుగుతున్న ప్రయోగాలు, పరిశోధన కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపస్‌లోని లైబ్రరీని సందర్శించిన కలెక్టర్ మార్క్స్ , డార్విన్ , న్యూటన్ పుస్తకాలు సేకరణలు ఆనందాన్ని , ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఇక్కడ సమయం గడపడం చాలా సంతోషంగా ఉందని అక్కడ సందర్శకుల పుస్తకంలో రాశారు. సంరక్షించబడి ఉన్న పాత, విలువైన పుస్తకాలను దగ్గరగా పరిశీలించి, వాటిని మరింత ప్రమాణాలతో పరిరక్షిస్తున్న విధానాన్ని అభినందించారు. విద్యార్థుల అధ్యయనం, పరిశోధన, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తూ కళాశాల చేస్తున్న ప్రయత్నాలు అత్యంత ప్రశంసనీయం అని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రామచంద్రరావు, ఎన్ ఆర్ సి కో ఆర్డినేటర్ డా. సంజీవ్, ఎన్.సి.సి కోఆర్డినేటర్ డా. యూసుఫ్ బాషా కోఆర్డినేటర్ డా. అన్నపూర్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ డా. రాజేశ్వరి, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ రవితేజ, పిఆర్వో డా. జల్ల సురేశ్, అన్ని విభాగాల హెడ్‌లు, ఇతర కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఆహారంతో ఆరోగ్యకరమైన జీవనం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : సేంద్రీయ ఆహారంతోనే ఆరోగ్యకర జీవనం - గో ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో గ్రామ వికాస్ ఆంధ్రప్రదేశ్, వ్యవసాయ శాఖ, ప్రకృతి రైతు కుడప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సదస్సులో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి గో ఆధారిత ఉత్పత్తులు, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన పంటల గురించి విశేషాలు అడిగి తెలుసుకున్నారు. సదస్సుకు శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ శావల దేవదత్, వాడపల్లి దేవ స్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ నరసింహరావు, ముత్త బత్తుల రాజు సర్పంచ్, పేచర్ల పుల్లంరాజువర్మ మాజీ సర్పంచ్, తదితరులు హాజరయ్యారు. రైతులు ఏర్పాటు చేసిన గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ఈ పద్ధతిలో సాగు చేస్తే రాబడి ఎలా ఉంటుందో అడుగగా, రైతులు మంచి లాభాలు వస్తున్నట్లు తెలి పారు. తరువాత జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం ఆరోగ్యకరమైన జీవి తానికి పునాది అని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడిన ఆహారం వల్ల అనారోగ్య సమస్యలు, ముఖ్యంగా క్యాన్సర్ ముప్పు పెరుగుతోం దని ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం భవిష్యత్తు భారత వ్యవసాయానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గోఆధారిత సాగు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైందని, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించే చర్యలు చేపడు తున్నారని తెలిపారు. రైతులలో అవగాహన పెంచేందుకు నియోజకవర్గ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి నాలుగు మండలాల్లో ఇలాంటి సదస్సులు నిర్వ హిస్తామని తెలిపారు. రావుల పాలెం, కొత్తపేటల్లో గో ఆధారిత సేంద్రియ ఉత్పత్తుల రిటైల్ దుకాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి బోసు బాబు, వివిధ జిల్లాల ప్రాజెక్ట్ మేనే జర్లు, కృషివల కోకోనట్ ఫార్మ్ కంపెనీ ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - మామిడి కుదురు : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు అందరూ వినియోగించుకోవాలని నగరం పీఏసీఎస్ చైర్మన్ ఈలి శ్రీనివాస్ అన్నారు. సొసైటీ కార్యాలయం వద్ద 2025 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఈలి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ రైతు కూడా నాణ్యతా ప్రమాణాలు ప్రకారం ఉన్న తన పంటను కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాలిసిన అవసరం లేదని రైతు విక్రయించిన ధాన్యం వాటి విలువ తదితర వివరములతో కూడిన రశీదు కచ్చితంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మట్టా సత్తిబాబు, కాకి శ్రీనివాస్, సీఈవో అడబాల సత్తిబాబు, వీఏఎస్ బొక్కా చంద్ర శేఖర్, సొసైటీ సిబ్బంది, ధాన్యం కొనుగోలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినీనటి హేమకు మాతృ వియోగం

విశాలాంధ్ర - రాజోలు : ప్రముఖ సినీ నటి హేమ తల్లి కోళ్ళ లక్ష్మీ (80) ఆకస్మిక మరణం పొందారు. కొంత కాలంగా ఆమె కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. తల్లి మరణవార్త తెలియ గానే హేమ హైదరాబాద్ నుండి హుటాహుటిన బయలుదేరి రాజోలు చేరుకున్నారు. తల్లి పార్థీవ దేహాన్ని చూసి బోరున విలపించారు. అనంతరం సోంపల్లి కైలాస భూమిలో జరిగిన తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కోళ్ళ లక్ష్మీకి కుమార్తె హేమ, కుమారుడు లక్ష్మీ ఫ్యాషన్ స్టుడియో అధినేత శ్రీనివాస్‌రావు ఉన్నారు.

వాడపల్లి ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మంగళవారం కొత్తపేట ఆర్డీవో పి శ్రీకర్, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు కలిసి పరిశీలించారు. అభివృద్ధి కార్యక్రమాల భాగంగా జరుగుతున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణం, కోనేరు అభివృద్ధి పనులు, భక్తుల కోసం క్యూ లైన్ల ఏర్పాటు వంటి అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. భవిష్యత్తులో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చేపట్టనున్న ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం స్థల పరిశీలన కూడా నిర్వహించారు. ఈ సందర్భంలో ఎంపీడీవో వెంకటరామన్, ఎమ్ఆర్ఓ రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ అధ్యక్షులు గోపి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ఆది నుండి తెలుగు దేశం పార్టీ కార్యకర్త నుండి ముమ్మిడివరం టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పాటు పార్టీ కోసం సేవలందిస్తున్న గొల్లపల్లి గోపి పుట్టినరోజు వేడుకలను ముమ్మిడివరం అన్న క్యాంటీన్లో ఘనంగా నిర్వహించారు. అన్న క్యాంటీన్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, జిల్లా టిడిపి కార్యదర్శి తాడి నరసింహారావు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహిం చారు, పుర ప్రముఖులు ఘనంగా దుస్సాలవాలు, పూలమాలలతో ఘనం గా సత్కరించారు. నగర పంచాయితీ కమిషనర్ రవి వర్మ ఆధ్వర్యంలో వారి సిబ్బంది గోపిని ఘనంగా సత్కరించి ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి రమణ కుమార్, కట్టా సత్తిబాబు, అర్ధాన్ని శ్రీనివాసరావు, జనసేన నాయకులు గుద్దటి జమ్మి, యాళ్ళ ఉదయ్, చిక్కాల అంజిబాబు, నిమ్మకాయల విష్, కాకి మాణిక్యం, బొరుగు కళ్యాణ్, నీతి పూడి వంశీ, డేవిడ్ రాజ్, మెండి కమల, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, కుడిపూడి మల్లీశ్వరి, అత్తిలి ప్రసన్న, గిడ్ల రత్నశ్రీ, నాగమణి, నల్లా సత్తిబాబు, కటికిదల నాని, జంగా మాణికంఠ, రెడ్డి శ్రీను, దంగేటి శ్రీను, బాబులు, చింతపల్లి రాజు, యలమంచిలి రాజా, సబ్బతి రాంబాబు, కాశీ మూర్తి పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరు పై మండల పరిషత్ సమావేశం అభ్యంతరం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండల పరిషత్ సమావేశానికి అధికారులకు బదులుగా, కిందిస్థాయి సిబ్బందిని పంపించడంపై కాట్రేనికోన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మండల పరిషత్ అధ్యక్షురాలు కోలాటి సత్యవతి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో సభ్యులు ఈ మేరకు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికి సభ్యులను అవమానించడమేనని సభ్యులు వ్యాఖ్యానించారు. మూడేళ్లగా అధికారులు ఇదేరీతిలో సమావేశాలకు గైర్హాజరవుతున్నా, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సానబోయిన నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ మునీంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, సమావేశాలకు హాజరుకాని అధికారుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నానని, జిల్లా అధికారులే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటాచలం సభ్యులకు తెలిపారు. ఇదిలావుండగా, ఆధార్‌లో మార్పులు చేర్పుల దరఖాస్తులపై మండలంలోని గెజిటెడ్ అధికారులు సంతకాలు చేయకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్ సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. సమావేశంలో ఎంపీపీ ఇంటికి వెళ్లే రోడ్డులో ఆక్రమణల తొలగింపు, అమలాపురం - పల్లంకురు రూట్లో ఆర్టీసీ బస్సులు నడపటం, గెద్దనపల్ల పశువైద్యశాల భవన ప్రారంభోత్సవం తదితర అంశాలపై చర్చ జరిగింది. అలాగే మండలంలో ఆక్వా రిజిస్ట్రేషన్, విద్యుత్ సబ్సిడీ, పక్కా గృహాల లబ్దిదారుల రీ సర్వే తదితర వాటిపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ వేణు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్, కాట్రేనికోన సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి పెసంగి రంగారావువర్మ, కాట్రేనికోన, చెయ్యేరు ఎంపిటిసిలు మోకా చంద్ర నాగరత్నం, రాయుడు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి రజిత సర్పాభరణం

విశాలాంధ్ర - ఐ పోలవరం : మురమళ్ళ నిత్యం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్న నిత్య కల్యాణ వీరేశ్వరుడికి మంగళవారం ఒక భక్తుడు రజిత సర్పాభరణం బహుకరించారు. కూసంపూడి సతీష్ వర్మ దంపతులు వెండితో తయారు చేసిన సర్పాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు. వీటికి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ సంప్రోక్షణ జరిపి, అనంతరం స్వామి వారికి అలంకరించారు. ఈసందర్భంగా దాతను ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి సత్యనారాయణ అభినందించారు.

క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2025 నవంబర్ 18న "క్లీన్ అండ్ గ్రీన్" పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకటరామన్ మాట్లాడుతూ సహజ వనరుల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. సూర్యకాంతి, గాలి, నీరు, మట్టి, ఖనిజాలు, అడవులు, మొక్కలు, వన్యప్రాణులు వంటి వనరులను రక్షించడం ద్వారా కాలుష్య రహిత వాతావరణం, ఆరోగ్యకరమైన జీవన విధానం, స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. "గ్రీన్ అంటే కేవలం పచ్చదనం మాత్రమే కాదుబీ నదులు, సముద్రాలు, అడవులు, భూమి వంటి సహజ వనరులను దీర్ఘకాలం నిలుపుకోవడం కూడా అదే భావం" అని ఎంపిడిఓ పేర్కొన్నారు. పరిశుభ్రత ఉద్యమాలు, చెట్ల నాటకం, వ్యర్థాల నిర్వహణ, గ్రామాభివృద్ధి పథకాల అమలులో ప్రజా ప్రతినిధులు ముందుండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపి డిఓ పివిఆర్‌కె రాజు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు డ్రోన్లు అందజేత

విశాలాంధ్ర - కరప : వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులకు 39 లక్షల 20 వేల రూపాయలు విలువగల డ్రోన్లను సబ్సిడీపై గ్రూప్ రైతులకు కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ మంగళవారం కరప రైతు సేవా కేంద్రం వద్ద అందించారు. వ్యవసాయ అధికారులు ఏడిఏ కే బాబురావు, ఐ సత్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొని డ్రోన్లు అందించారు. అనంతరం కరప మండలంలోని రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు సేకరణ ఏ విధంగా జరుగుతున్నది అధికారులు అడిగి తెలుసుకున్నారు. కరప మండలంలో 18 ధాన్యం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయగా 425 మంది రైతుల నుండి 1965 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల ఖాతాలో 24 గంటల్లో డబ్బులు జమ చేయబడతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి కొండబాబు, బందారు మురళి, ముద్రగడ రమేష్, భోగి రెడ్డి గంగాధర్, వైపండు, సొసైటీ అధ్యక్షులు సైనవరపు భవాని శంకర్, దూడల నాయుడు, వెలుగుబంట్ల సూరిబాబు, రెడ్డి సత్యనారాయణ, వెంకన్న రావు చౌదరి, దుర్గాప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు స్ఫూర్తి వల్లభాయ్‌పటేల్

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి మాసోత్సవాలు సందర్భంగా యువత, విద్యార్థులతో ఇండోర్ స్టేడియం గ్రౌండు నుండి ఫైర్ స్టేషన్ వరకు ఘనంగా యూనిటీ మార్చ్ ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ యం.జె.అభిషేక్ గౌడ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అభిషేక్ గౌడ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ప్రజలంతా జాతీయ ఐక్యతా భావంతో మెలగాలన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా ఏలూరును నిలుపుతామని, ప్రతి ఒక్కరూ కృషిచేయ్యాలని కోరారు. జిల్లా ఎస్పీ నక్కా సూర్యచంద్ర రావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం తర్వాత ఉప ప్రధానిగా, కేంద్ర హెూం శాఖా మంత్రిగా వల్లభాయ్‌పటేల్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడలు యువజన సంక్షేమ, మైభారత్ యువజన అధికారి సుంకర రాము, జెడ్పీ సిఈవో యం.శ్రీహరి, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

శక్తి టీంకు అభినందనలు

ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని

విశాలాంధ్ర - ఏలూరు : సమాచారం అందించగానే తక్షణం స్పందించి మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న శక్తి టీంకి ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని మంగళవారం ఒక ప్రకటనలో అభి నంద నలు తెలిపారు. ఏలూరు నగరం లోని పవర్ పేట దగ్గరలో గల రోబో రెస్టారెంట్ వద్ద భార్యాభర్తలిద్దరూ ఉండి వారిలో భార్యని భర్త కొడుతున్నారని చెప్పి చుట్టుపక్కల ఉన్న వారు ఏలూరు జిల్లా మహిళా సమాఖ్యకి సమాచారం అందించారు. తక్షణం జిల్లా కార్యదర్శి మన్నవ యామిని నగరంలోని శక్తి టీమ్‌కు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న శక్తి టీం తక్షణం స్పందించి అక్కడికి చేరుకుని, ఆ భర్తని మందలించి వారికి ఫ్యామిలీ కౌన్సి లింగ్ ఇచ్చారు. ఫోన్ ద్వారా సమాచారం తెలిపిన కొద్ది క్షణాల్లోనే స్పందించి అక్కడికి వెళ్లి ఆమెను రక్షించినందుకు మహిళ శక్తి టీం కి ఆంధ్రప్రదేశ్ మహి ళా సమాఖ్య తరపున అభినందనలు తెలియజేస్తున్నామని మన్నవ యామిని తెలిపారు. ఇలా ఎన్ని టీములు డ్యూటీ చేస్తున్నప్పటికీ మహిళలపై జరుగు తున్న అత్యాచారాలు దాడులు ఆగటం లేదని, ఇలాంటి వాటిని అరికట్టడానికి శక్తిటీంను మరింత బలోపేతం చేయాలని కోరారు.

సామాజికన్యాయం, ఆత్మగౌరవమే మా నినాదం

విశాలాంధ్ర - నిడదవోలు : సామాజిక న్యాయం- ఆత్మ గౌరవమే మా నినాదమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాముదూరి నాగేంద్ర వర ప్రసాద్ అన్నారు. సామాజికన్యాయం, ఆత్మగౌరవం నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు నిడదవోలులో సీపీఐ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హిం చారు. ఈ సందర్భంగా నాగేంద్ర వరప్రసాద్ మాట్లాడుతూ 1దేశంలో దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనా రిటీలు పై దాడులు పెరిగాయని, దేశంలో శాంతి భద్రతలు క్షీణించా యని, ఆర్ఎస్ఎస్‌సంఘ పరివార్ ఎజండాను అమలు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు మాముదూరి నాగేంద్ర వర ప్రసాద్ విమర్శించారు. బిసిలకు స్థానిక సంస్థలలో అన్యాయం జరుగుతుందని, జనగణనతో పాటు కులగ ణను త్వరితగతిన చేపట్టాలని బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహ శీల్దార్ నాగరాజు నాయక్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రొవ్విడి నాగరాజు, గన్నాబత్తుల సత్యనారా యణ, మెయిలి శ్రీను, రామిశెట్టి సత్తిబాబు, బీజా అప్పారావు,కోసూరి శ్రీను, రొంగల శ్రీను, మామిడి సన్యాసిరావు, క్రొవ్విడి మస్తాన్, కాకి అప్పలరాజు, పెంటపాటి వెంకట రావు, బద్ది సూరిబాబు, చోడిశెట్టి లోవరాజు, జల్లా వెంకటేశులు, నంద్యాల వీర్రాజు, చిడగం శ్రీనివాసు, సయ్యద్ అలీ , పొలిమాటి తాతబ్బాయి, రవి పాల్గొన్నారు.

కోనసీమ కలెక్టరేట్ ఎదుట సిపిఐ భారీ ధర్నా

- దళితులు గిరిజనులు మైనార్టీలపై దాడులు

అరికట్టాలని డేగా ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర - అమలాపురం : దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఐ శ్రేణులు భారీ ధర్నా ధర్నా నిర్వహించారు. దేశంలో దళితులు, గిరిజనులు, క్రైస్తవులు, ముస్లిం మైనారిటీలపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ దేశ వ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం అమలాపురం కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జిల్లా ఇన్చార్జ్ డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఈ దేశంలో దళితులు గిరిజనులు, మహిళలు మైనార్టీలపై జరుగుతున్న దాడులు అత్యాచారాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా భారత రాజ్యాంగాన్ని అమలు చేయకుండా ప్రజాస్వామ్యాన్ని లౌకికవాదానికి: ప్రస్తుత పాలకులు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ రాసినటువంటి రాజ్యాంగాన్ని రిజర్వేషన్లను అమలు చేయకుండా నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధంగా ఉన్న బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాల పై వివక్ష కొనసాగిస్తూ ఆ ప్రజలను అభద్రతా భావంలోకి నెట్టివేశారని డేగా ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. జనగణనలో కుల గణన చేపట్టి వివిధ సామాజిక వర్గాల ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించి సామాజిక న్యాయం పాటించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం ద్వారా రిజర్వేషన్ వర్గాలకు తీరని అన్యాయం చేస్తు న్నారని అన్నారు. పరిశ్రమల స్థాపనకు పంటకు పనికిరాని భూములు ఇస్తే పర్వాలేదని కానీ రెండు లేదా మూడు పంటలు పండే సారవం తమైన భూములను కార్పోరేట్లకు ఇవ్వడం వలన దేశంలో ఆహార కొరత, శ్రామికులకు, కూలీలకు జీవనోపాధి కరువు అవుతుందని అన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలను ఎండగట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, రిజర్వే షన్స్ ప్రయివేట్ రంగంలో కూడా అమలుచేయాలని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దళితులు, బాలికలపై అత్యాచారాలు పెరిగిపోయాయని రామచంద్ర పురంలో దళిత బాలికను దారుణంగా హత్య చేశారని ఈ హత్యపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచా రణ జరిపి దోషులను కఠినంగా శిక్షిం చాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్ర మంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సత్తిబాబు, నాయకులు పెద్దిరెడ్డి. రాము, శీలం వెంకటేష్, కొండె రామకృష్ణ, చెల్లుబోయిన. తాతారావు, జి రవికుమార్, దీపాటి శివ ప్రసాద్, వేమగిరి సామ్యూల్, చిట్టూరి ప్రసాద్, దేవ సురేష్ బాబు, గెద్దం ప్రభాకర రావు, పి ఆనంద్, జి దాసు, కామేశ్వరరావు, డి భానోజీ, బత్తుల మురళీకృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండించండి

- జనగణనలో కుల గణన చేపట్టాలని

కోరుతూ సీపీఐ ధర్నా

విశాలాంధ్ర - కాకినాడ : దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం నవంబర్ 18వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళన చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా కాకినాడ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాకు సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కామిరెడ్డి బోడకొండ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన నుండి గత 11 సంవత్సరాల కాలంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు మితిమీరిపోతున్నాయని, దేశంలో మతో న్మాద పాలన సాగుతుందని, రాజ్యాంగం కల్పించిన మానవహక్కులు సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వానికి పాత్ర వేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ నేష నల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో 2023 నివేదిక ప్రకారం షెడ్యూల్ కులాలు (ఎస్సీ) వారిపై జరిగిన నేరాలకు 57,789 కేసులు, షెడ్యూల్ తెగల (ఎస్టీ) వారిపై జరిగిన నేరాలకు 12960 కేసులు నమోదయ్యా యని, మహిళలపై 4.48 లక్షల నేరాలు నమోద వడం విచారకరమని ఆయన అన్నారు. ఈ పరిస్థి తుల్లో భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యకు హక్కు లను హరించే దుష్టశక్తులను తిప్పికొట్టేందుకు ప్రజ లంతా ఐక్యంగా ఉద్యమించాలని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకునేం దుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, లౌకిక వ్యవస్థను కాపాడేందుకు మనమంతా నడుం కట్టా లని ఆయన అన్నారు. తెలంగాణలో ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కుల గణన చేపట్ట నం దుకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయిస్తూ లెక్కల కేటా యిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదిం చిం దని, అదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్లో కూడా జన గణనల్లో కుల గణన చేపట్టాలనీ, కులాల ప్రతి పదికన బీసీలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని సిపిఐగా డిమాండ్ చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్ల సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ భవాని, కెవి రామయ్య, ఎన్ అనిల్ కుమార్, బాల కృష్ణ, ఏసు పాదం, అర్జున్‌రావు, మడగల రమణ, సూరిబాబు, బర్ల లక్ష్మీనారాయణ, నమ్మి సత్య నారాయణ, అడపా చిట్టిబాబు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు యోధుడు బండారు లక్ష్మణస్వామి మృతి



విశాలాంధ్ర - అమలాపురం : సీపీఐ సీనియర్ నాయకులు బండారు లక్ష్మణ స్వామి మంగళవారం మరణించారు. ఆయన సీపీఐ పార్టీ తొలితరం నాయకులలో ఒకరు, శతాధిక వృద్ధులు లక్ష్మణస్వామికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, ఆరుగురు మనవళ్లు, నలుగురు మనవరాళ్లు, ఎనిమిది మంది ముని మనవళ్లు ఉన్నారు. ఈ మొత్తం కుటుంబాన్ని కమ్యూనిస్ట్ పార్టీ జెండా కింద నడిపిన నిబద్ధత కలిగిన నాయకుడు, ఊహ తెలిసిన తర్వాత పట్టుకున్న ఎర్రజెండాను చని పోయే వరకు మోశారు. ఏడిద గ్రామంలో ఆయన నేతృత్వంలో నిరుపేద లకు 2000 ఇళ్ళు సాధించారు. సుమారు 5 ఎకరాలు అసైన్డ్ భూములు పేద ప్రజలతో ఆక్రమణ చేయించి నేటికి వాటి మీద ప్రజలు బతికేల పోరాటం చేసి సాధించారు. సీపీఐ చేపట్టిన అన్ని కార్యక్రమాలు విజయవం తానికి శక్తివంచన లేకుండా పని చేశారు. రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు ఎవరు వచ్చి నా ఆయన స్వగృహంలోనే ఆతిథ్యం ఇచ్చే వారు. ఆయన కుటుంబంలో మూడు తరాలు పార్టీకి అంకితం అయి పని చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో విద్యార్థులకు, యువకులకు దఫా దఫాలుగా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. జనసేవాదళ్ క్యాంపులు పెట్టి వందలాది జనసేవా దళ్ కార్యకర్తలను తయారు చేశారు. లక్ష్మణ స్వామి అంతిమ యాత్ర బుధవారం ఉదయం 8 గంటలకు ఆయన ఇంటి నుండి ప్రారంభం అవుతుంది. లక్ష్మణ్ స్వామి భౌతికకా యాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ స్టాలిన్, డాక్టర్ రామా రావు, డాక్టర్ చల్లా రవికుమార్, సమితిసభ్యులు శామ్యూల్, రామకృష్ణ, రాము, తాతాజీ, ప్రముఖ న్యాయవాది గోపాల్, కృష్ణ, యేసుదాసు, యేసు రాజు, చంద్ర రావు పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించి వారి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

పాఠశాలల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం అవసరం

విశాలాంధ్ర - కలిదిండి: పాఠశాలల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరం అని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. మంగళ వారం మండలంలోని చిన్న తాడినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యా యులేనని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల స్థల దాతలు చిన్న రాము ,పెద రాములను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైర్ అయిన కీర్తిశేషులు యాళ్ల లక్ష్మీబాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు శుభకరరావు ,కోడలు సువార్త వాణి పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు, చిన్న తాడినాడ గ్రామానికి చెందిన సిహెచ్. చిరంజీవి రూ.2 వేలు విరాళంగా ప్రధానోపాధ్యాయులు దామోదరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండికోట. ఏసుబాబు, ఎస్ఎంసి చైర్మన్ కొల్లాటి సత్యవతి , మం డల విద్యాశాఖాధికారి అనిశెట్టి శ్రీనివాస్, కాంప్లెక్స్ చైర్మన్ జి.వి రమణ, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

విశాలాంధ్ర-దేవరపల్లి:దేవరపల్లి గోపాలపురం రోడ్డులో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం నాడు భారీ స్థాయిలో అన్న సమారాధన జరిగింది కార్తీక మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు గంగ సింధూరం కుంకుమ తమలపాకులతో పూజలు నిర్వహించారు తెల్లవారుజాము నుండి ఉదయం 11 గంటల వరకు పూజలు కొనసాగాయి అనంతరం అన్న సమారాధన నిర్వహించారు దేవరపల్లి బందపురం గొల్లగూడెం దుద్దుకూరు రామన్నపాలెం కృష్ణం పాలెం కొత్తగూడెం ధుమంతునిగూడెం అచ్యయ్యపాలెం బుచ్చయ్య పాలెం గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు విశేష ఏర్పాటు చేశారు

పూజా కార్యక్రమాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం లక్ష్మీపురంలోని కార్తీక మాసం సందర్భంగా హరిహర క్షేత్రంలో మంగళ వారం వివిధ పూజా కార్యక్రమాలు స్వామివారికి కొబ్బరినీళ్ళ చెరుకురసం పండ్ల రసాలతో అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు వేద పండితులు లింగాల శ్రీనివాస్ శర్మ నవీన్ శర్మఅర్చకులు ప్రవీణ్ శర్మ పోసుబాబుఆధ్వర్యంలో నిర్వహించారు అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అని ఏర్పాటు చేశారు

స్వాములకు సత్కారం

విశాలాంధ్ర-దేవరపల్లి: అయ్యప్ప సన్నిధికి పాద యాత్ర చేసిన స్వాములకు సత్కారం చేసిన యర్నగూడెం అయ్యప్ప సేవా సమితి సభ్యులు అయ్యప్ప దీక్ష చేపట్టి ఇరుముడి కట్టుకొని శబరిమలై అయ్యప్ప దర్శనానికి 1640 కిలోమీటర్లు పాదయాత్ర చేసి దైవ దర్శనం చేసుకొని వస్తున్న స్వాములను యర్నగూడెం అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మందిరం వద్దకు ఆహ్వానించి చిరు సత్కారాన్ని అందించారు. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం గ్రామానికి చెందిన కట్టుం శ్రీనివాస్ గురుస్వామి పసగాడి రామారావు స్వాములు 41రోజులు అయ్యప్ప దీక్ష చేపట్టి విజయదశమి రోజున శబరిమలై పాదయాత్ర చేస్తూ తిరుపతి కాణిపాకం శ్రీపురం అరుణాచలం భవానీ మీదుగా పళని నుండి శబరిమలై వెళ్ళి అయ్యప్పను దర్శించుకున్నామని వేయిన్నొక్క గుడులు ఏడు పుణ్యక్షేత్రాలను దర్శించి 41 దేవాలయాల్లో నిద్రించడం జరిగిందని శ్రీనివాస్ స్వామి తెలిపారు కార్యక్రమంలో యర్నగూడెం అయ్యప్ప సేవాసమితి సభ్యులు బళ్ల రవి కుమార్ నరహరిశెట్టి అంజిబాబు మందరపు బాల బ్రహ్మానందం బళ్ల రాము కావలివరపు సుబ్రహ్మణ్యం నల్లం వెంకటేశ్వరరావు పుట్టా రమణ గురుస్వాములు పాల్గొన్నారు

మాస శివరాత్రి వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యం లో శ్రీ పార్వతి సమేత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం లో కార్తీక మాసం మాస శివరాత్రి పర్వదినం సందర్భం గా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రా భిషేకం,బిల్వార్చన, కుంకుమ పూజ చేసి సాయంత్రం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం గండికోట మహేష్,వాడపల్లి సాయి,అర్చకులు వీరేంద్ర శర్మ గార్ల ఆధ్వర్యం లో జరిగినది.కార్యక్రమం లో కేసీరాజు కాశీవిశ్వనాథం, విష్ణు భొట్లపద్మనాభ శాస్త్రి, కల్లూరి శ్రీనివాస్ శర్మ, పల్లిభట్ల కృష్ణబాబు, ఈ మని శ్రీరామచంద్ర మూర్తి, కేసీరాజు రాజకుమార్ మొదలగు వారు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ

విశాలాంధ్ర -నల్లజర్ల : గోపాలపురం నియోజకవర్గం

నల్లజర్ల మండలంచీపురుగూడెం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ గ్రామంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ హోంమంత్రి. గోపాలపురం నియోజకవర్గం ఇన్చార్జ్ తానేటి వనిత. ఆదేశాల మేరకు నల్లజర్ల మండలం వైసిపి అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చీపురుగూడెం గ్రామ ఇన్చార్జ్ బళ్ళ ప్రభాకర్ రావు చీపురుగూడెం గ్రామ కమిటీ అధ్యక్షులుకొరపాటి గంగరాజు అధ్యక్షతన.. కోటి సంతకాలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సందర్భంగా మండల అధ్యక్షులు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ఇప్పటి కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం పట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వసంతాడ ఇజ్రాయేలు పెనుమాక వెంకటరత్నం , తమిర్పి జోష్ బాబు , భీమడోలు సురేష్ బాబు , చల్లారి అప్పన్న బాబు , గుర్రం వెంకటేశ్వరరావు , ప్రత్తిపాటి ఏసురత్నం , వసంతాటి సతీష్ , జాలాది రవికుమార్ భీమడోలు వెంకట్ , పోలిపం వినయ్ గాలింకి శ్రీనివాస్ , తలంశెట్టి నేతాజీ చల్లారి గంగాధర్ రావు , గాలికి రాంబాబు , చెల్లు హరిబాబు , మల్లిడి శ్రీనివాస్ రెడ్డి నల్లజర్ల మండలం సోషల్ మీడియా కన్వీనర్ భీమడోలు వెంకటేశ్వరరావు , చీపురు గూడెం గ్రామ ప్రెసిడెంట్ గాలింకి మల్లిక , నాయకులు, యూత్,చీపురుగూడెం గ్రామస్తులు సహాయ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

గ్రంథాలయ వారోత్సవాలలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - సీతానగరం: విద్యార్థులు నిత్యం పుస్తక పఠనంతోనే జ్ఞానం సంపాదించుకోవచ్చు అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి చిట్టిబాబు అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కళాశాల గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో నిరంతరం పుస్తక పఠనంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు అని అన్నారు. ఎందరో మహానుభావులు పుస్తక పఠనంతోనే తమ జీవితాలను సార్థకం చేసుకున్నారని అన్నారు. విద్యార్థి జీవితంతోనే పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే అది మన ఎదుగుదలకు జ్ఞానాన్ని సంపాదించి పెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, లైబ్రేరియన్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రత పై అవగాహనా

విశాలాంధ్ర - కడియం : కడియం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శులకు పచ్చదనం పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కె రమేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గుల్ల విన్నిబాబు బందారు తాతారావు తదితరులు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే, డ్రైయిన్లను క్రమ పద్ధతిలో శుభ్రం చేయడంతో పాటు చెత్త సేకరణ చేసేటప్పుడు గ్రామ ప్రజలకు తడి చెత్త, పొడి చెత్తలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉల్లిపాయ తొక్కలు, కోడి గుడ్డు పెంకులు వంటివి మొక్కలకు పోషకాలు అందిస్తాయని అన్నారు. పచ్చదనం పరిశుభ్రత కొరకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఈఓపిఆర్డీ నీలం శ్రీనివాస్, గ్రేడ్ 1 టు 5 పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.

అన్న సమారాధన కార్యక్రమంలో కంబాల

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం గ్రామ శివారులో ఉన్న శ్రీ పార్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి అలయం వద్ద మంగళవారం నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని, ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు కంబాల శ్రీనివాసరావుని ఘనంగా సత్కరించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయం వద్ద కోనేరు నిర్మాణానికి ఇటీవలే 5 లక్షలు రూపాయలు కమిటీ సభ్యులకు విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, కూటమి నాయకులు, బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు, పెద్దాడ వెంకన్న దొర, నాగ రమేష్, అంజలి, పదిలం మురళి దేశాల నరేష్, తాటికొండ సురేష్, అంబటి శ్రీను, కొలుసు రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.బి

శ్రీ కోట సత్తెమ్మ ను దర్శించుకున్న మంత్రి దుర్గేష్

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజు పాలెంలో వేంచేసియున్న శ్రీకోటసత్తెమ్మను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖండ గోదావరి ప్రాజెక్టు లో భాగంగా శ్రీ అమ్మవారి ఆలయనికి విచ్చేసిన దుర్గేష్ కు ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వాహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవి శంకర్, ఆలయ అర్చకులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ , జనసేన పట్టణ అధ్యక్షులు రంగా రమేష్,జనసేన నాయకులు పాల్గొన్నారు.

రోగులు వైద్యుల సలహాలను పాటించాలి

విశాలాంధ్ర - ఉండ్రాజవరం : ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వారోత్సవాలు పై పి.హెచ్.సి ఉండ్రాజవరం లో అవగాహన కార్యక్రమాలను వైద్యాధికారి డా. బి. దుర్గమహే శ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గా మహేశ్వరరావు దుర్గా మహేశ్వరరావు మాట్లాడుతూ , ఏదైనా అనారోగ్యం కానీ, వ్యాధితో కానీ బాధ పడుతున్నపుడు రోగులు వైద్యులు యొక్క సూచన ప్రకారం కాకుండా విచ్చలవిడిగా, ఎవరికి తోచిన ప్రకారం వారు, యాంటీబయటిక్ మందులు వాడితే, ఆ మందులకు మన శరీరంలో వ్యాధిని కలిగించే బాక్టీరియా, ఫంగై, వైరస్, పారసైట్స్ మొదలగునవి నిరోధక శక్తిని పెంపొందించుకోవడం ద్వారా, తదుపరి దశలో, ఆ యాంటీబయటిక్స్ ఏవి కూడా పనిచేయని స్థితి కి వచ్చునని, వారి ద్వారా ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందినపుడు వారికి కూడా మొదటే యాంటీబయటిక్స్ కి పనిచేయని స్థితి వస్తుందని తెలియ చేశారు. కావున అందరూ వైద్యుల సూచన మేరకు మాత్రమే యాంటీబయటిక్స్ వాడాలని, ఎన్ని రోజులు వాడమని చెపితే, అన్ని రోజులు పూర్తి కోర్సు వాడవలెనని తెలియ చేశారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఎక్కువగా గాని, తక్కువగా కానీ, యాంటీబయటిక్స్ వాడకూడదు అని, ఈ విధంగా చేయడం వలన ప్రపంచంలో ప్రతీ సంవత్సరం లక్షలాదిమంది చనిపోతున్నారని అందుకే యాంటీబయటిక్స్ వాడకం పై అందరిలోనూ అవగాహన రావాలని చెప్పారు. అదేవిధంగా ఆవులు, మేకలు, గేదెలు మొదలగు పశువులు మరియు పెంపుడు జంతువులకు కూడా వైద్యులు సూచనలు లేకుండా తెలిసినవే కదా అని ఇష్టమొచ్చినట్లు యాంటీబయటిక్స్ వాడకూడదు అని, అలా చేస్తే వాటినుంచి వచ్చే పాలు, మాంసం, గ్రుడ్లు మొదలైన ఉత్పత్తులు తీసుకోవడం వలన, వాటి సంరక్షణ సమయంలో వాటి ని తాకడం వలన కూడా మనుష్యులు కు మందులు పనిచేయని స్థితిలో ఉండే వ్యాధులు వస్తాయని కావున ప్రతీ వ్యక్తీ అనవసరంగా, తెలియకుండా, వైద్యుల సూచన లేకుండా యాంటీబయటిక్స్ వాడకూడదు అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్. ఓ సుబ్రహ్మణ్యం, పి. హెచ్.ఎన్ కుమారి, ఎమ్. పి. హెచ్. ఎస్ శ్రీరామమూర్తి, ఫార్మసిస్ట్ శ్రీదేవి పాల్గొన్నారు.